రాజు ఆలోచించి కొన్ని బంగారు నాణాలని మంత్రి ద్వారా ఆ వ్యాపారస్థుడికి భవిష్యత్‌లో కొనబోయే సరుకు నిమిత్తం పంపాడు. మర్నాడు రాజు అతని దుకాణం పక్క నించి వెళ్తుంటే రాజుకి ఆ దుకాణం యజమాని మీద స్నేహ భావం కలిగింది. లోపలకి వెళ్ళి రాజు ఆ వ్యాపారస్థుడ్ని అడిగాడు.

"ఇప్పుడు ఏం ఆలోచిస్తున్నావు?"

"మీరు పదికాలాల పాటు చల్లగా వుండాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నాను ప్రభూ." చెప్పాడు అతను.

ఇలా ఇతరుల మనోభావాలు మనకి తెలీకుండానే మన మీద తమ ప్రభావాన్ని చూపిస్తాయి. ఆ మనిషి అక్కడ లేకపోయినా సరే అతని అనుకూల లేదా ప్రతికూల మనోభావాల తరంగాలు ఆ ప్రదేశంలో చాలాకాలం వుంటాయి. ఇందుకే హిమాలయాల్లో అనాదిగా లక్షల మంది ఋషులు చేసిన తపస్సు తాలుకు తరంగాలు అక్కడ వుండి, సాధకులకి అవి ధ్యానంలో మేలు చేస్తాయి. సూక్ష్మమైన రూపంలో మనిషి ఆలోచనా తరంగాలు ఈ ప్రపంచంలో తిరుగుతూనే వుంటాయి. అందుకే హిందువులు 'సర్వే జనాస్సుఖినో భవంతు' అంటూ చేసే ప్రార్థన అనుకూల తరంగాలని సృష్టిస్తాయనే చేస్తారు. ఇలాగే శాంతి మంత్రాలు వల్లె వేయడం వెనక కూడా గల పరమార్థం ఇదే." వివరించాడు గురువు.

## 118. మోక్ష మార్గం

మోక్షాపేక్ష గల ఓ రాజు తన రాజధానికి వచ్చిన ఓ మహనీయుడ్ని తన సభకి సగౌరవంగా ఆహ్వానించాడు. రాజు ఆయన్ని సభా ముఖద్వారం దగ్గర ఎదురై పూర్ణకుంభంతో ఆహ్వానం పలికి సభలోకి వెంట తీసుకెళ్ళాడు. ఆయన్ని సభికుల ఎదుట అడిగాడు.

"మోక్షం పొందే దారి దయచేసి చెప్పండి."

ఐతే ఆ మహనీయుడు రాజు మాటలని వినిపించుకోకుండా సభలోని పరిచారకుల యోగక్షేమాలని విచారించసాగాడు. రాజు తన ప్రశ్నని ఐదారుసార్లు వేసినా ఆయన దాన్ని పట్టించుకోక, సభికులందరిని ఒక్కొక్కర్నే పిలిచి వారితో

ఆప్యాయంగా మాట్లాడసాగాడు. రాజు వైపు అసలు కన్నెత్తి కూడా చూడలేదు. దాంతో కోపం వచ్చిన రాజు ఆయన్ని తీసుకెళ్ళి కారాగారంలో బంధించమని, తన ప్రశ్నకి జవాబు చెప్పేదాకా వదలద్దని భటులకి ఆజ్ఞాపించాడు. అప్పుడు ఆ మహనీయుడు రాజు వైపు చూసి, చిరునవ్వుతో చెప్పాడు.

"రాజా! ఇందాకటి నించి నేను నీ ప్రశ్నకి మౌనంగా చెప్పే జవాబు నీకు అర్థం అయినట్లు లేదు. నీకన్నా తక్కువ స్థాయివారిని నేను పలకరిస్తూ, నిన్ను పట్టించుకోక పోవడం వల్ల నీకు నా మీద కోపం వచ్చింది. దాంతో నాకు శిక్ష వేసావు. మరి నాకన్నా, నీకన్నా, మనందరి కన్నా శ్రేష్ఠుడైన ఆ పరమాత్మని నువ్వు తలచుకోకుండా వుంటే ఆయనకి కోపం రాదా? నీ ప్రశ్నకి ఇదే జవాబు. సదా ఆయన్ని స్మరిస్తూండు. అలాంటి వారికే మోక్షం ఎప్పుడూ సిద్ధంగా వుంటుంది."

## 119. అబద్ధం

ఇద్దరు సాధువులు ఓ కొండ మీద తపస్సు చేసుకుంటున్నారు. వారున్న కొండ అంచు అవతల సముద్రం వుంది. అకస్మాత్తుగా వేటగాళ్ళ బూర కొమ్ముల ధ్వని, వారి వల్ల బెదిరి పరిగెత్తే జంతువుల అరుపులు, వారెక్కి వచ్చే గుర్రాల కాలి గిట్టల ధ్వని వాళ్ళకి వినిపించాయి. ఓ జింక వారి వైపు వేగంగా పరిగెత్తుకుని వచ్చింది. కొండ అంచు దాకా వచ్చి అవతల వున్న సముద్రాన్ని చూసి కుడి వైపు పరిగెత్తి మాయమైంది.

ఓ సాధువు రెండో అతనితో చెప్పాడు.

"వేటగాళ్ళు వచ్చి మనల్ని ఆ జింక ఎటెళ్ళిందని అడుగుతారు. నిజం చెప్తే దాన్ని వాళ్ళు వెంటాడి చంపుతారు."

"మనకి తెలీదని చెప్దాం." రెండో సాధువు సూచించాడు.

"అది అబద్ధం ఆడటం అవుతుంది. మనం ఎప్పుడూ అబద్ధాలు ఆడకూడదు."

"నిజం చెప్తే మాత్రం ఆ జింకని చంపిన పాపం చుట్టుకోదా?" ప్రశ్నించాడు రెండో సాధువు.